

సీసీ కెమెరాలు ప్రారంభించిన అనంతరం సమస్యలపై పారిజాతారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి

- మాజీ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, ఈ దృష్ట్యా ప్రతి కాలనీలోనూ వాటి ఏర్పాటుకు స్థానికులు ముందుకు రావాలని బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి సూచించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లోని ఆల్విన్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో పోలీసులపై పని భారం తగ్గుతుందని అన్నారు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు క్షణాల్లో నిందితులను గుర్తించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె అన్నారు. అనంతరం పలు సమస్యలపై ఆమెకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, వష్ణువర్ధన్‌రెడ్డి, బాలాపూర్ ఎస్‌ఐ సైదులు, యూత్ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ అఫ్జల్ అహ్మద్, సయ్యద్ షకీల్, మహ్మద్ కలీం, మోయిజ్, నయామ్, అహ్మద్, అనీస్, ఖయ్యూం పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

సీసీ కెమెరాలు ప్రారంభం

వనస్థలిపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1 సంక్షేమ భవనం, దేవిపోచమ్మ దాసాంజనేయస్వామి ఆలయంలో కాలనీవాసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ లచ్చిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు నియంత్రించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఆర్టీసీ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి


కొత్తపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కాలనీ సంక్షేమ సంఘం భవనంలోని జిమ్‌లో యువకుల కోసం అదనంగా ఏర్పాటు చేసుకున్న వ్యాయామ పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో అందరూ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు బీజేపీ నాయకులు అంబాల మల్లేష్‌గౌడ్, రాజేష్, సుందర్‌నారాయణ, తోట మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.



పల్లె రవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు

పల్లె రవికి ఎమ్మెల్సీ కవిత పరామర్శ

ఎల్‌బీనగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు, కల్లు గీతా కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి బుధవారం పరామర్శించారు. తెలంగాణభవన్‌లో జరిగిన సమావేశానికి హాజరైన రవికుమార్ ప్రమాదవశాత్తు జారీ పడడంతో కాలుకు తీవ్రగాయమైంది. దీంతో ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విశ్రాంతి తీసుకుంటున్న రవికుమార్ నివాసానికి కవిత చేరుకుని ఆరోగ్య పరిస్థితిని, బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ వైద్యులు సూచించిన విధంగా తగిన విశ్రాంతి తీసుకుని త్వరగా కోలుకుని తిరిగి ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆమె ఆకాక్షించారు. కవిత వెంట మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు కాచం సత్యనారాయణ, కాచం సుష్మ, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, సాగర్ రెడ్డి, సుశీలారెడ్డి, పార్వతి, నిర్మల, ఆడాల రమేష్, మాదవరం నర్సింహారావుతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, పలు ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు, అభిమానులు తదితరులు రవికుమార్‌ను పరామర్శించారు.



జర్నలిస్ట్ శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మారెడ్డి

జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సాయం

హయత్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్‌లో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన జర్నలిస్ట్ సురెపల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను బుధవారం బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు 11వేల ఆర్థిక సాయం అందించారు. శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

దివ్యాంగుల ఉద్యానవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి

- ఎమ్మెల్యేతో సమీక్షా సమావేశంలో ఫెడ్ ప్రతినిధుల డిమాండ్

చాదర్‌ఘాట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసమే ప్రత్యేకంగా తీర్చిదిద్దిన మలక్‌పేటలోని అంతర్జాతీయ దివ్యాంగుల ఉద్యానవనంలో తిష్టవేసిన జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయాన్ని తక్షణమే తరలించి దివ్యాంగులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. ఫెడ్ అధ్యక్షుడు గంగారాం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, ఆయేషా ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకురాలు, మాజీ కార్పొరేటర్ ఆయేషా, జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ యుగేందర్‌రెడ్డితో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. కేవలం దివ్యాంగుల కోసమే ప్రత్యేకంగా తీర్చిదిద్దిన అంతర్జాతీయ దివ్యాంగుల ఉద్యానవనంలో తాత్కాలికమంటూ జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయాన్ని ఏర్పాటు చేసి మూడేళ్లు గడుస్తుందని ఫెడ్ అధ్యక్షుడు గంగారం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం ఎమ్మెల్యేకు వివరించారు. మలక్‌పేటలోని ప్రభుత్వ క్వార్టర్స్‌ను జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం ఏర్పాటుకు కేటాయించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం క్వార్టర్స్ మరమ్మతుల కోసం రూ.15లక్షలను కూడా వెచ్చించిందన్నారు. మొదట్లో గతేడాది అక్టోబరు మాసంలోనే జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయాన్ని తరలిస్తున్నట్లుగా ప్రకటించారని, అక్టోబరులో దసరా పండుగ తర్వాత అన్నారు. ఆ తర్వాత దీపావళి పండుగ తర్వాత తరలిస్తామని చెప్పారు. ఆ తర్వాత కొత్త సంవత్సరం 2025 జనవరి 1వ తేది నాటికి సర్కిల్-6 కార్యాలయాన్ని మలక్‌పేటలోని ప్రభుత్వ క్వార్టర్స్‌లోకి తరలించేందుకు అవసరమైన పూజలు కూడా చేశారని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఇదంతా జరిగి మరో మూడు మాసాలు గడుస్తున్నా ఇంతవరకు సర్కిల్-6 కార్యాలయాన్ని తరలించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన మానసిక దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన సెన్సరీ బ్లాక్‌లు, వ్యాయామాలు చేయించే మరి కొన్ని సెంటర్లు సర్కిల్-6 కార్యాలయం ఏర్పాటుతో తాత్కాలికంగా మూత పడ్డాయని వారు ఎమ్మెల్యేకు వివరించారు. వీలైనంత త్వరగా సర్కిల్-6 కార్యాలయం తరలించేందుకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై మరోసారి జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయానికి చెందిన అన్ని విభాగాల అధికారులతో సమావేశమై వీలైనంత త్వరగా దివ్యాంగుల ఉద్యానవనం నుంచి కార్యాలయాన్ని తరలించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.



ఫెడ్ ప్రతినిధులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బలాల

ఎవరికీ తలొంచకుండా సక్రమ నిర్మాణాలు చేపట్టండి

- ప్రజలకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచన
- దౌత్య నియమాలు పాటించకుండా కొందరి కార్పొరేటర్ల తీరు
- ఎవరెన్ని కుట్రలు పన్నినా అభివృద్ధి పనులను ఆపం

మన్సూరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కొందరు కార్పొరేటర్లు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా చేపడుతున్న కట్టడాల వద్ద వసూళ్లకు మరిగి వత్తాసు పలుకుతున్నారని, వారి మాటలు నమ్మి మోసపోకుండా అన్ని నిబంధనలతో ఎవరికీ తలొంచకుండా నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.71లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరస్వతీనగర్‌లో రూ.18లక్షలతో నీటి స్తబ్దత తొలగింపు, సీసీ రోడ్ల నిర్మాణం, రూ.10లక్షల అంచనా వ్యయంతో వీరన్నగుట్టలో ఓపెన్ జిమ్ ఏర్పాటు, టీనగర్‌లో రూ.11 లక్షలతో, వీరన్నగుట్టలో రూ.10.50లక్షలతో, విజయ్‌నగర్ కాలనీలో రూ.21.50లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశామన్నారు. హతిగూడ చెరువుకు ఎఫ్‌టీఎల్ పరిధి ఉన్నప్పటికీ కొందరు బీజేపీ నాయకులు తమతో సత్సంబంధంగా ఉన్నవారి ప్లాట్లను టార్గెట్ చేసుకుని వారి ప్లాట్ల గుండా కందకం తొలగిస్తున్నారన్నారు. మన్సూరాబాద్‌లోని శివంహిల్స్, టీనగర్, దుర్గానగర్, వీరన్నగుట్ట ప్రాంతాల్లో మరెన్నో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, వాటిని త్వరలోనే చేపడతామన్నారు. విజయవాడ నేషనల్ హైవే ఎత్తుగా ఉండడంతో దానికి ఆనుకుని ఉన్న కాలనీల్లోకి రాకపోకలు సాగించడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యూటర్న్ లేక తలెత్తుతున్న ఇబ్బందులను రహదారి పనులు పూర్తయిన వెంటనే అవసరమైన చోట యూటర్న్ ఏర్పాటు చేసేలా ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంలో కనీసం దౌత్య నియమాలు పాటించని అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన కొందరు కార్పొరేటర్లు, నాయకులు కుట్రలు పన్నుతున్నారని, వారి కుట్రలను నియోజకవర్గ ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే విశ్వసించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పోచబోయిన జగదీశ్‌యాదవ్, కొసనం వెంకట్‌రెడ్డి, జక్కిడి రఘువీర్ రెడ్డి, రుద్ర యాదగిరి, అనిల్‌కుమార్, కేకేఎల్ గౌడ్, నర్సింగ్‌రావు, ఆనంద్‌యాదవ్, మహేష్, భాస్కర్, ఆయా కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పాతబస్తీలోని తన నివాసంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో మజ్లీస్ శాసన సభాపక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ పక్కన చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ తదితరులు - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

యోగా గురువు పరమేశ్వర్‌కు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న యోగా గురువు పరమేశ్వర్

వనస్థలిపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురానికి చెందిన యోగా గురువు అల్లాడి పరమేశ్వర్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు అమెరికన్ సౌత్ వెస్ట్రన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం గోవాలో అచీవర్స్ కౌన్సిల్ చైర్మన్ ఆర్.సెల్వం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అల్లాడి పరమేశ్వర్‌కు సంస్థ ప్రతినిధులు డాక్టరేట్‌ను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ వనస్థలిపురంలో 15ఏళ్లుగా విశ్వజ్యోతి ఉచిత యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఎంతో మందికి ఉచితంగా యోగా నేర్పించి వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేసిన నా సేవలను గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేయడం సంతోషకరం అన్నారు. భవిష్యత్‌లో మరెంతోమందికి ఉచిత యోగాను అందించడానికి కృషి చేస్తానన్నారు. తనకు డాక్టరేట్‌ను అందజేసిన సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేకే ఎమ్మెల్యే అక్కసు

- నామ మాత్రపు సమాచారంతో నేను లేకుండా శంకుస్థాపనలు
- నేను కొట్లాడి తెచ్చిన పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొడుతుండు
- జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో తనపై వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన అనుచరులతో నాపై అసత్య ప్రచారాలు చేసి తన అక్కసు వెల్లగక్కుతున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి విమర్శించారు. నామ మాత్రపు సమాచారమిచ్చి తాను లేకుండా డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడాన్ని విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిలో భాగంగా అధికారులతో తాను కొట్లాడి తెచ్చిన రూ.1.58కోట్ల నిధుల్లో భాగమే ఎమ్మెల్యే రూ.71లక్షలతో శంకుస్థాపన చేసిన పనులని, ఆ కార్యక్రమానికి వస్తే మంచిపేరు వస్తుందనే అక్కసుతో తనకు నామ మాత్రపు సమాచారమిచ్చారని ఆరోపించారు. తన కృషితో పాటు ఎంపీ ఈటల రాజేందర్ చొరవతోనే మన్సూరాబాద్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోందని, ఇందులో ఎమ్మెల్యేది నామ మాత్రపు పాత్రేనని ఆరోపించారు. ఏడాది పాటు ఎమ్మెల్యే అందుబాటులో లేకున్నా డివిజన్ అభివృద్ధిని ఎంపీ సహకారంతో పరుగులు పెట్టించామని, ఇంకా డివిజన్‌లో రూ.4కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని కార్పొరేటర్ పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, నాయకులు యంజాల్ జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, పారంద సాయి తదితరులు పాల్గొన్నారు.



తాను కొట్లాడి తెచ్చిన అభివృద్ధి పనుల వివరాలు ఆధారాలతో చూపుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి



హనుమాన్ ఆలయంలోని రాజగోపురం ముందు గ్రిల్స్ స్టీల్‌గేట్‌ను ప్రారంభిస్తున్న ఈవో లావణ్య, దాతలు ప్రకాష్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి : ఈవో

చంపాపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయం దాతల సహకారంతో అభివృద్ధి చెందుతోందని ఆలయ ఈవో ఎస్.లావణ్య అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో రాజగోపురం ముందు దాతలు రెడ్డి బ్రదర్స్ అధినేత డి.ప్రకాష్‌రెడ్డి, మాజీ ధర్మకర్త బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, స్వర్గీయ డాక్టర్ కంచనపల్లి రవీందర్‌రాజు జ్ఞాపకార్థం రూ.3లక్షలతో చేపట్టిన గ్రిల్స్ స్టీల్‌గేట్‌ను బుధవారం దాతలతో కలిసి ఈవో ఎస్.లావణ్య ప్రారంభించారు. అదేవిధంగా దాతలు జాలె వెంకట్‌రెడ్డి, అండాళమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు జాలె నర్సింహారెడ్డి ప్రేమలత, జాలె తిలక్‌రెడ్డి శృతి వంటశాలలో రూ.10లక్షలతో చేపట్టిన రఫ్ గ్రానైట్ ఫ్లోరింగ్‌ను దాతలతో కలిసి ఈవో ప్రారంభించారు. అనంతరం స్వామి వారి దర్శనం అనంతరం దాతలకు వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం అందించగా ఈవో వారికి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్త బేర బాలకిషన్, కిల్లా మైసమ్మ ఆలయ మాజీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, భక్తులు విశాల్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, ఏవీరెడ్డి, కృష్ణ, ఆలయ వేద పండితులు, అర్చకులు, సిబ్బంది వెంకటయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

చంపాపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ ఇన్నర్‌రింగ్ రోడ్ డిఫెన్స్‌కాలనీలోని శ్రీహరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రెండవరోజు బుధవారం ఆలయంలో గణపతిపూజ, మండపారాధన పూజలు, అయ్యప్పస్వామి మూలమంత్ర హవనములు, సుదర్శనహోమం, కుంకుమపూజలు, నవవిధ హారతులను చాముండేశ్వరీ గురుదత్తపీఠం వ్యవస్థాపకుడు శ్రీరామశరణ్‌శర్మ గురూజీ బ్రహ్మత్వంలో వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ఈవో ఎస్.లావణ్య, ఆలయ వ్యవస్థాపకుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ఆలయ డైరెక్టర్లు సందీప్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సూర్యప్రకాష్‌గుప్తా, మిర్యాల అంజయ్యగుప్తా, రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్, దశరథ్‌గౌడ్, రమేష్‌గౌడ్, విజ్ఞేశ్వర్‌రెడ్డి, హరికృష్ణగుప్తా, నరేందర్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించిన సుదర్శన హోమం పూర్ణాహుతిలో పాల్గొన్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

ఆర్‌యూబీ నిర్మించారు.. రోడ్డును మరిచారు

- ఇరుకు రోడ్డుతో ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్
- ఇది చాదర్‌ఘాట్‌లోని మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద దుస్థితి

చాదర్‌ఘాట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్‌లోని మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్‌యూబీకి అనుసందానంగా కొత్తగా మరో వెంట్(ఆర్‌యూబీ) నిర్మించారు. ఇందుకు గాను రైల్వే శాఖ రూ.12కోట్లను వెచ్చించింది. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రత్యేక చొరవ తీసుకుని దక్షిణ మధ్య రైల్వే శాఖాధికారులతో పలుమార్లు చర్చించి రూపొందించిన ప్రతిపాదనల మేరకు కొత్తగా ఆర్‌యూబీ కార్యరూపం దాల్చింది. దాదాపు నాలుగేళ్లపాటు సాగిన ఈ ఆర్‌యూబీ నిర్మాణం కారణంగా ఇటు వాహనాల రాకపోకలకు, అటు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒక దశలో ఆర్‌యూబీ నిర్మాణం కారణంగా రైల్వే ట్రాక్ కొంతవరకు దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దాదాపు వారం రోజుల పాటు రైళ్ల రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోగా రైల్వే ట్రాక్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. దీంతో అటు రైల్వే ట్రాక్‌తోపాటు, ఆర్‌యూబీ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయి. ఒకవైపు ఆర్‌యూబీ పనులు జరుగుతుండగానే రైల్వే శాఖాధికారులు ట్రయల్ రన్ నిర్వహించి మలక్‌పేట రైల్వే స్టేషన్ మీదుగా రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

ఇప్పుడున్న రెండు వెంట్లకు అనుసందానంగా మరో వెంట్ నిర్మాణం

చాదర్‌ఘాట్‌లోని మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఆర్‌యూబీకి రెండు వెంట్లను నిర్మించారు. దిల్‌సుఖ్‌నగర్ మలక్‌పేట మీదుగా వచ్చే వాహనాలు కోఠి, ఎంజీబీఎస్, చార్మినార్ వైపుకు ఇటు సైదాబాద్ మీదుగా వచ్చే అన్ని రకాల వాహనాలు ఈ రెండు వెంట్ల నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. ఒక వైపు ఉన్న వెంట్ కుడివైపుకు మలక్‌పేట రైల్వే స్టేషన్ ఉండడంతో ఇటు వైపు మరో వెంట్‌ను నిర్మించేందుకు అవకాశం లేదు. ఇక అటు వైపు ఉన్న వెంట్‌కు ఎడమ వైపు మరో వెంట్ నిర్మించేందుకు ఉన్న అవకాశంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు మూడో వెంట్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందుకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రైల్వే శాఖామంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లి పలుమార్లు ఇక్కడ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను విన్నవించారు. ఇప్పుడున్న రెండు వెంట్లకు అనుసందానంగా మూడో వెంట్ నిర్మించాలని నిర్ణయించి రూపొందించిన ప్రతిపాదనలకు రూ.12కోట్ల నిధులను మంజూరు చేశారు. నిధుల మంజూరుకు దాదాపు రెండేళ్ల సమయం పట్టగా, వెంట్ నిర్మాణానికి నాలుగేళ్లు పట్టింది.



కొత్తగా నిర్మించిన మరో వెంట్‌కు అనుసందానంగా పూర్తి కాని రోడ్డు పనులు



పూర్తయిన కొత్తగా మరో వెంట్(ఆర్‌యూబీ)

వెంట్ నిర్మాణం పూర్తై ఏడాది గడుస్తున్నా.. పూర్తి కాని రోడ్డు పనులు

మలక్‌పేట ఆర్‌యూబీకి అనుసందానంగా మూడో వెంట్ నిర్మాణం పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా ఈ వెంట్ నుంచి వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా రోడ్డు నిర్మాణ పనులు జరగడం లేదు. ఫలితంగా ఏడాది నుంచి పనులు నిలిచిపోయాయి. చాదర్‌ఘాట్ నుంచి ఇక్కడి ఆర్‌యూబీ నుంచి వెళ్లే వాహనాలు నిలిచిపోయి రోడ్డు పనుల కారణంగా పూర్తయిన వెంట్ అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

నూతన రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల నిధులు

కొత్తగా నిర్మించిన మూడో వెంట్‌ను కలుపుతూ నూతనంగా రోడ్డు నిర్మించేందుకు హెచ్‌ఆర్‌డీసీఎల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పలుమార్లు చర్చించారు. ఈ మేరకు రూ.3కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు సమాచారం. పనుల నిర్మాణంలో జరిగిన జాప్యంతో రోడ్డు పనులు పెండింగ్‌లో పడ్డాయి.

సామాజిక సేవలకు డాక్టరేట్ ప్రదానం

షాపూర్‌నగర్ : సమాజ సేవచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సామజికవేత్త బుడల అమర్‌బాబుకు డాక్టరేట్ లభించింది. కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన అమర్‌బాబుకు అమెరికాలోని గాడ్ హోలీ స్పిరిట్ థియోలాజికల్ అకాడమి ఈ నెల 10న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆయనకు డాక్టరేట్ పట్టాను అందజేశారు.